# 57

# క్రైస్తవులు, మానవ ప్రభుత్వాలు

## (13:1-7)

పౌర అధికారాలతో దేవుని ప్రజలు ఎలాటి సంబంధం కలిగియుండాలనేది యేసు కాలంనాటి విస్తరించిన (వ్యాపించిన) ప్రశ్నయైయుంది. ఒక సందర్భంలో ప్రభువారి శత్రువులు, "మనము కైసరునకు పన్ను ఇచ్చుట న్యాయమా కాదా?" అని ఆయననడిగారు (లూకా 20:22). యూదులు రోమీయులను ద్వేషించి, వారికి పన్ను చెల్లింపనసహ్యించుకొన్నారు. అయితే వీరి ప్రశ్న నిజంగా ఆయనకు ఉచ్చువేయనుద్దేశించినదైయుంది. "అవును" అని క్రీస్తు జవాబు చెప్పియుంటే, ఆయన తన్ను వెంబడిస్తున్న యూదులను దూరం చేసికొనేవారు. "లేదు" అని ఆయన అనియుంటే, ఆయన శత్రువులు ఆయనపై గవర్నరుకు ఫిర్యాదు చేసియుండేవారు (20 వచనం). ఆయన ఒక దేనారము నెత్తిపట్టి, "దీనిమీద రూపమును పై వ్రాతయు ఎవనివని?" అడిగారు (24ఎ వచనం). "వారు 'కైసరువనిరి' " (24బి వచనం). అందుకాయన, "ఆలాగైతే కైసరువి కైసరునకును దేవునివి దేవునికిని చెల్లించుడని" వారితో చెప్పెను (25 వచనం).

యూదులైతే "కైసరువి కైసరుకివ్వ" యిష్టపడనివారైయున్నారు. వారికిని వారి విశ్వాసానికిని రోమీయులు అనేక ప్రత్యేక మినహాయింపులు యిచ్చారు. అయినా కోపము వారి హృదయాల్లో యింకను పొగరాజుతోంది. ద్వేషం కట్టబడుతూ కొనసాగింది. కడకు అది క్రీ.శ. 64లో యూదుల తిరుగుబాటుగా పరిణమించింది. అది క్రీ.శ. 70లో యెరూషలేము నాశనంగా ప్రతిఫలించింది.

క్రీ.శ. 57 లేక 58లో పౌలు రోమీయులకు వ్రాసినప్పుడు, యూదుల కోపము మరిగిన స్థాయికి చేరుకుంది. ముందుగా గమనించినట్టే, ఆ పట్టణంలోని సంఘమందు యూదులున్నారు (2:17) – రోమా ప్రభుత్వానికి విరోధంగా చెడ్డ భావాలు దాచుకున్నారనడానికి సందేహపడనవసరం లేదు. ఈ పాయింటు విషయంలో యూదులలోనుండి వచ్చిన తమ సహోదరులపట్ల అన్యజనులలోనుండి వచ్చినవారు ఏకాభిప్రాయం కలిగియుండవచ్చు. దీనికి కొన్ని సంవత్సరాలకు ముందు యూదులు, క్రైస్తవులు కూడ రోమాపురినుండి వెళ్లగొట్టబడ్డారు.[1]

ఇవియు, మరియు యితర విషయాలు మన ప్రస్తుతపు మూల వాక్యంలో చేర్చునట్లు పౌలుకు ప్రేరణ కలిగించియుండవచ్చు. మరియొక విషయం ఏదైయుంటుందంటే, క్రీస్తునందున్న స్వాతంత్ర్యము (గలతీయులకు 5:1) అంటే, రోమీయుల చట్టాలతో చేర్చి వారు మరి ఏ చట్టానికి లోబడవలసినవారు కాదని కొందరు క్రైస్తవులు తలంచి యుండవచ్చు. తరువాత కొన్ని సంవత్సరాలకు రానున్న నీరో యొక్క హింస కూడ పౌలు

ఎదురు చూచియుండవచ్చు. దేశంపట్ల క్రైస్తవ స్వభావంలో యిది ఎలాటి ఫలితాన్ని యిస్తుందో కూడ తలంచియుండవచ్చు.

తన ఉద్దేశం ఏమైయున్నా, పౌలు – ఆత్మచే ప్రేరేపింపబడినవాడై – కృపచేత రక్షింపబడిన వ్యక్తి మానవ ప్రభుత్వాలతో ఎట్టి సంబంధం కలిగియుండాలో అనేదానిపై ఉపదేశం యిందులో చేర్చడం ప్రాముఖ్యమని తలంచియుంటాడు. ఈ అంశం 1 తిమోతి 2:1, 2; తీతు 3:1; మరియు 1 పేతురు 2:13, 14, 17 ప్రస్తావించబడింది; కాని క్రొత్త నిబంధనలోనే దీర్ఘమైన చర్చ రోమా 13:1–7లో ఉంది. బాంధవ్యంలోని ప్రతి విషయం గాని, అడుగదగిన ప్రతి ప్రశ్నకు మన మూల వాక్యము జవాబు చెప్పదు. కానప్పటికిని, ఈ అంశం మీద యిది ప్రాముఖ్యమైన ప్రత్యక్షతయైయుండి, మన అందరి జీవితాలలో యిది ప్రభావితమౌతుంది.

మనం క్రైస్తవులమైనప్పుడు, మనం అంధకార సంబంధమైన అధికారంలోనుండి విడుదల చేయబడి, దేవుని కుమారుని రాజ్య నివాసులుగా చేయబడ్డాం (కొలొస్సయులకు 1:13). అయినప్పటికీ, మనమింకను భూ సంబంధమైన దేశ పౌరులుగా ఉంటాం. పౌర అధికారాలతో మనం ఎలాటి సంబంధం కలిగియుండాలి? మన బాధ్యతలు ఏమైయుంటాయి? ఏలాటి పౌరులమైయుండాలని దేవుడు మనలను ఎదురు చూస్తూ ఉంటాడు? రోమా 13:1–7లో పౌలుచే ఈలాటి ప్రశ్నలు చర్చించబడ్డాయి.[2]

## అధికారాన్ని గుర్తించు (13:1, 2, 4, 6)

ఈ లేఖన భాగం యిలా ప్రారంభించబడుతుంది: "ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను" (1ఎ వచనం). ఇదియు, 13:1–7లోని యితర ఆజ్ఞలను మనం చర్చించక ముందు, ఈలాటి తుడుచుకొంటూ వస్తున్న ఆజ్ఞను పౌలు ఎందుకు స్థాపించవలసి వచ్చిందో సర్వే చేద్దాం.

### సాధారణ సూత్రం

మన విధేయతకు ఆధారంతో పౌలు ఆరంభించాడు. "ఏలయనగా దేవునివలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు" (1బి వచనం). "అధికారులు" మరియు "అధికారము" అనే పదాలు వచనం 1లో *exousia* నుండి వచ్చాయి, అంటే, "అధికారాన్ని చెలామణి చేసే హక్కును"[3] సూచిస్తుంది. దేవదూతలను సూచించడానికి పౌలు కొన్నిసార్లు *exousia*ను వాడాడు (ఎఫెసీయులకు 6:12), గనుక యిక్కడ అపొస్తలునికి ఆలాటి మనస్సు ఉందని కొందరు నమ్ముతారు. అయినా, *exousia* మరో చోట మానవ అధికారాలను సూచిస్తుంది (లూకా 12:11). రోమా 13:6, 7లో, ఈ అధికారులకు పన్నులు చెల్లించడాన్ని గూర్చి పౌలు మాట్లాడాడు, గనుక, మానవ ప్రభుత్వమే అతని మనస్సులో ఉన్నట్టు నిశ్చయంగా చెప్పవచ్చు. J. B. Phillips' తర్జుమాలో "పౌర అధికారాలు" అని ఉండగా, NCVలో "ప్రభుత్వ ఏలికలు" అని ఉంది.

పౌర ప్రభుత్వాన్ని పౌలు సూచిస్తున్నట్టు భావించి, మన పఠనాన్ని కొనసాగించుదాం:

"ఏలయనగా దేవునివలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవునివలననే నియమింపబడియున్నవి" (1బి వచనం). "నియమింపబడి" అనేది *tasso* నుండి వచ్చింది, అంటే, "క్రమములో ఉంచు, అమర్చు," "నియమించు,"[4] లేక "ఏర్పరచు" అని అర్థం (KJV చూడు). 4వ వచనంవరకు వీక్షించుకొంటూ వస్తే, అధికారులు "దేవుని పరిచారకులని" రెండుసార్లు కన్పిస్తుంది. 6వ వచనంలో, ఏలికలు "దేవుని సేవకులని" పిలువబడ్డారు. రోమా 13ను నీవు ఎన్నడూ చదువకయుంటే, ఈ ప్రతిపాదనలు బహు వింతగాను విడ్డూరంగాను కన్పించవచ్చు. ఏదియెలాగున్నా, ఫరోను గూర్చి వర్ణించినప్పుడు, అధ్యాయం 9లో, భూ ఏలికలపై దేవుని ఆధిపత్యాన్ని పౌలు నొక్కి చెప్పాడు (16–18 వచనాలు).

విశ్వ వ్యాప్తమైన దేవుని సర్వాధికారాన్ని గూర్చియు భూరాజులు (ఏలికలు) ఆయనకు లోబడాలని ప్రకటించిన లేక రాసిన మొదటి బైబిలు లేఖకుడు పౌలు కాదు. దేవుడైన యెహోవా పక్షంగా మాట్లాడుతూ, సొలొమోను యిలా రాశాడు, "నావలన రాజులు ఏలుదురు అధికారులు న్యాయమునుబట్టి పాలనచేయుదురు" (సామెతలు 8:15, 16ఎ). పారసీక రాజైన కోరెషు దేవుని మంద "కాపరి" అనియు, దేవునిచే "అభిషేకింపబడిన వాడనియు" పిలువబడ్డాడు (యెషయా 44:28; 45:1).[5] దేవుడు "రాజులను తొలగించి, రాజులను స్థిరపరచుననియు," "సర్వోన్నతుడు మానవుల రాజ్యముల మీద అధికారియై యున్నాడనియు" దానియేలు బబులోను రాజైన నెబుకద్నెజరునకు తెలియజేశాడు (దానియేలు 2:21; 4:17).[6] తీర్పు తీర్చబడడానికి పిలాతు యెదుట యేసు నిలిచియుండినప్పుడు, "పైనుండి నీకు ఇయ్యబడియుంటేనే తప్ప నామీద నీకు ఏ అధికారమును ఉండదు" అని ఆయన అతనితో చెప్పారు (యోహాను 19:11ఎ).

### సాధారణంగా గమనించిన విషయాలు

దైవ ప్రేరేపితమైన ఈ ప్రతిపాదనలు మనం చదువుతుండగా, ప్రశ్నలు మన మనస్సులో వరదవలె పొర్లి వస్తుంటాయి. గతంలోను, ప్రస్తుతంలోను ఉన్న దుష్టులైన ఏలికలను గూర్చి మనం ఆశ్చర్యపోతూ ఉంటాం[7]: దేవుడు వారిని నియమించాడా? వారి పరిపాలనలు దేవునిచే స్థాపింపబడినవేనా? రేకెత్తించబడే ప్రతి ప్రశ్నకు మనం జవాబు చెప్పలేం, కాని దేవుడు మానవ ప్రభుత్వాలను గూర్చి కొన్ని విషయాలు గమనించగలం.

1. మానవుల మేలుకొరకు దేవుడు మానవ ప్రభుత్వాలను నియమించాడు. దేవుడు గృహాన్ని ఏర్పరచాడు (ఆదికాండము 3), సంఘాన్ని ఏర్పరచాడు (అపొస్తలుల కార్యములు 2), మానవ ప్రభుత్వాలను కూడా ఆయనే స్థాపించినట్టు రోమా 13 తేటపరచుతోంది.[8] ప్రజలకు అది అవసరం గనుక పౌర అధికారాలను ఆయనే నియమించాడు. Burton Coffman యిలా రాశాడు,

> నియమింపబడిన అధికారం లేకుండ, లోకమంతా అవ్యక్త స్థితి మరియు చెడిపోయిన శిథిలావస్థగా మారిపోతుంది. కళ్లెంపెట్టని మానవ స్వభావం వన్య మృగమువంటిదై

దేశంచేత విధింపబడే హద్దుల క్రింద నెమ్మదిలేని అసౌఖ్యమైనదిగా ఉంటుంది. ఏ చిన్న అవకాశమున్నా, దాని సంకెళ్లు తెంచుకొనడానికిని లోకాన్ని రక్తంతోను భయోత్పాతంతోను పాడుచేయడానికి ఎప్పుడును సంసిద్ధంగా ఉంటుంది.[9]

Jack P. Lewis "ఏ ప్రభుత్వ రూపమైనా అరాచకానికంటే మేలుగా ఎంచబడుతుందని"[10] అన్నాడు. ఏలాటి ప్రభుత్వం శ్రేష్ఠమైనది, ఎంత తక్కువగా అది మనకు అవసరం అనేదానిమీద భిన్నాభిప్రాయం ఉండవచ్చు, కాని మనం దీనిమీద ఏకీభవించవచ్చు: పౌర అధికార సూత్రం దేవునిచే నియమింపబడింది.

"నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు" అని 4వ వచనం అంటుంది. "నీ భద్రత కొరకు అధికారి దేవుని సేవకుడైయున్నాడు" అని Phillips అంటుంది. భద్రతకు తోడు, మన పట్టణ, రాష్ట్ర, జాతీయ ప్రభుత్వాలు మనం సొంతగా పొందడానికి కష్టమైన లేక అసాధ్యమైన సేవలు మన క్షేమం కొరకు యిస్తాయి.[11]

2. ప్రతి పౌర అధికారము యొక్క ఉనికిని దేవుడు అనుమతిస్తాడు గనుక అవి నిలిచియుంటాయి. ఏ ప్రత్యేకమైన భూ ఏలుబడికి దేవుడు బాధ్యుడైయుంటాడని మనం చెప్పలేం, కాని అది ఎందుకు ఉంటుందంటే, దేవుడు దాని ఉనికికి అనుమతించాడని మనం చెప్పగలం. గత కాలంలో ప్రశ్నించని విధేయతను తన ప్రజల యొద్దనుండి బలవంతపెట్టిన నియంతలు తప్పుగా రోమా 13:1-7ను ఉపయోగించుకున్నారు. వారి పరిపాలనలు దైవాంగీకారములని వారు చెప్పుకున్నారు. వారు రోమా 13నుండి కోట్ చేసి, సంఘ నాయకులు భక్తిహీనమైనవారి కార్యక్రమాన్ని బహిరంగంగా తమ సమ్మతిని తెలిపి బలపరచవలసిందిగా చెప్పారు. మానవ ప్రభుత్వము అనే సూత్రాన్ని దేవుడు స్థాపించినట్టు పౌలు ఉపదేశించాడు. కాని ప్రతి ప్రభుత్వ నాయకుని తన అధికారపు స్థానంలో దేవుడు ఉంచాడని అతడు ఉపదేశించ లేదు.

దేవుడు మానవ ప్రభుత్వాన్ని స్థాపించాడన్న వాస్తవం ప్రతి ప్రభుత్వాన్ని ఆయన అంగీకరించాడని అర్థమా? దేవుడు గృహాన్ని ఏర్పరచాడు. అయితే ప్రతి గృహాన్ని ఆయన అంగీకరించాడని దాని భావమా? లేదు. దేవుడు సంఘాన్ని ఏర్పరచాడు. ప్రతి స్థానిక సంఘాన్ని ఆయన అంగీకరించాడని దాని అర్థమా? లేదు (ప్రకటన 2:4, 14, 20లను చూడు). ఆలాగే, ప్రతి ప్రభుత్వానికి దేవుని వ్యక్తిగతమైన అంగీకారపు ముద్ర లేదు.

రోమా 13:1-7ని ఉపయోగించి గుడ్డి విధేయత కావాలని నిర్బంధించే ఏ ప్రభుత్వ నాయకుడైనా, లేఖనం రెండంచులు గల ఖడ్గమని గుర్తించవలసియుంటాడు. అతడు "దేవుని [పరిచారకుడు] సేవకుడుగా" కూడ ఉండాలని అది బోధిస్తున్న సంగతిని అతడు ఎరగాలి. దాసుడుగా ఉండడానికి బాధ్యతలు ఉంటాయి. ప్రత్యేకించి అది దేవునికి సేవాకత్వమైయుంది![12] దేవుడు "రాజులను త్రోసివేయుచు" "నియమించువాడునై" ఉన్నాడని దానియేలు 2:21 అంటుంది. ఇది ఏ యేలికకైనా ప్రశాంతమైన తలంపై ఉండాలి.

3. తన ఉద్దేశాలను నెరవేర్చుకొనడానికి దేవుడు దుష్ట ప్రభుత్వాలను సహితం ఉపయోగించుకోగలడు. కొన్ని సందర్భాల్లో, తన ఉద్దేశాలను నెరవేర్చుకొనడానికి

భక్తిలేని దేశాలను ఆయన ఉపయోగించుకున్నాడు. ఇశ్రాయేలును శిక్షించడానికి అష్షూరు దేవుని కోపమునకు సాధనమైన దండముగా ఉండింది (యెషయా 10:5).[13] యూదా యొక్క దుష్టత్వాన్ని శిక్షించడానికి దేవుడు బబులోనును ఉపయోగించుకున్నాడు (యిర్మీయా 25:9-11). అనుకూలమైన పరిస్థితిలో, యూదాను చెరలోనుండి విడిపించడానికి పారసీక రాజైన కోరెషును దేవుడు వాడుకున్నాడు (యెషయా 44:28-45:7; ఎజ్రా 1:1-4). దేవుడు పౌర అధికారాలను వాడుకోగలడని కొన్నిసార్లు వాడుకున్నాడని ఈ ఉదాహరణలు సూచిస్తాయి. దీనికి మించి మనం సాహసించలేం. మనకు తెలిసినదంతా, ఏదో ఒక విధంగా, దేవుడు లోక ప్రభుత్వాలను తన అదుపులో ఉంచుకుంటాడు. అంతంలో తన ఉద్దేశాలు నెరవేర్చబడతాయి.

పౌలు ఉపదేశము యొక్క తాకిడినుండి తప్పించుకొన ప్రయత్నించడంలో, "మంచి ప్రభుత్వాలు," "చెడ్డ ప్రభుత్వాలు" అనేవాటి మధ్య భేదాన్ని జనులు కొన్నిసార్లు చూప ప్రయత్నిస్తారు. "మనం కేవలం మంచి ప్రభుత్వాలకు మాత్రమే లోబడవలసియుంది" అని వారంటారు. రోమా 13:1-7ను మనం పఠిస్తుండగా, పౌలు దినాల్లో ఏలుబడి చేస్తున్న అధికారం రోమా సామ్రాజ్యమని మన మనస్సులో ఉంచుకోవాలి. రోమా సామ్రాజ్యం "మంచి ప్రభుత్వమా"? దానిలో కొన్ని విషయాలు మంచివి,[14] కాని రోమా చరిత్రతో నీకు పరిచయమున్నట్టయితే, ఆ ప్రభుత్వం చెడుగుతోను, నీచ కార్యములతోను నిండి యుంది. పౌలు వ్రాస్తున్నప్పుడు చక్రవర్తి - నీరో. "మానవత్వం లేని కుర్రాడు" అని "సొంత తల్లిని చంపిన దోషి" అని R. C. Bell నీరోను వర్ణించాడు.[15] అయినప్పటికిని, పౌలు యిలా అన్నాడు: "ప్రతివాడును పై అధికారులకు లోబడియుండవలెను; ఏలయనగా దేవునివలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు" (13:1ఎ).

పౌలు రోమా 13ను వ్రాసినప్పుడు రోమా ప్రభుత్వం ప్రక్కన మొగ్గు చూపాడు ఎందుకంటే అతడు రోమా పౌరుడైయుండి, రోమా అధికారులచే మంచిగా ట్రీట్ చేయబడ్డాడు-కాని అతడు తరువాత తన మనస్సు మార్చుకున్నట్టు చెప్పబడింది. ఆలాటి సలహా దైవప్రేరేపణ లేదనియు, వాస్తవాలను తప్పుగా వ్యాఖ్యానించడమునైయుంది. రోమా పత్రిక వ్రాయడానికి ముందు, పౌలు తప్పుగా రోమా అధికారులచే కొట్టబడి చెరసాలలో వేయబడ్డ వాస్తవాన్ని అది అలక్ష్యం చేసినట్లౌతుంది (అపొస్తలుల కార్యములు 16:22-24). వాస్తవంగా అతడు ముమ్మారు బెత్తములతో కొట్టబడ్డాడు (2 కొరింథీయులకు 11:25), అది రోమీయుల శిక్షావిధానమైయుంది. పైగా, రోమా అధికారులవలన నాలుగు సంవత్సరాలు తప్పుగా చెరసాలలో వేయబడినా, పౌలు సహించిన వాస్తవాన్ని ఆ సలహా అలక్ష్యం చేస్తుంది,[16] అయినా ఈ క్రింద సూచింపబడిన సంగతులను అతడు రాశాడు:

> ... మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము, అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరికొరకును రాజుల కొరకును అధికారులందరికొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను (1 తిమోతి 2:1, 2).

> అధిపతులకును అధికారులకును లోబడి విధేయులుగా ఉండవలెననియు ... వారికి జ్ఞాపకము చేయుము (తీతు 3:1ఎ).

హింసాకాండ నడుమ మరొక అపొస్తలుడు యిలా రాశాడు,

> మనుష్యులు నియమించు ప్రతి కట్టడకును ప్రభువు నిమిత్తమై లోబడియుండుడి. రాజు అందరికిని అధిపతియనియు, నాయకులు దుర్మార్గులకు ప్రతిదండన చేయుటకును సన్మార్గులకు మెప్పు కలుగుటకును రాజువలన పంపబడినవారనియు వారికి లోబడి యుండుడి. ఏలయనగా మీరిట్లు యుక్తప్రవర్తనగలవారై అజ్ఞానముగా మాటలాడు మూర్ఖుల నోరు మూయుట దేవుని చిత్తము. స్వతంత్రులైయుండియు దుష్టత్వమును కప్పిపెట్టుటకు మీ స్వాతంత్ర్యమును వినియోగపరచక, దేవునికి దాసులమని లోబడియుండుడి. అందరిని సన్మానించుడి, సహోదరులను ప్రేమించుడి, దేవునికి భయపడుడి, రాజును సన్మానించుడి (1 పేతురు 2:13-17).

రాజకీయ అధికారపు పగ్గాలు ఎవరి చేతిలో ఉన్నా, క్రైస్తవులు "మంచి పౌరులైయుండాలనేది" క్రొత్త నిబంధన యొక్క నిలకడగానున్న సందేశమైయుంది (రోమా 13:1; MSG).

## అధికారాన్ని గౌరవించు! (13:1-5)

**నియమం**

మానవ ప్రభుత్వాన్ని దేవుడు నియమించాడన్న విషయాన్ని మనస్సులో ఉంచుకొని, మూల వాక్యాన్ని పరీక్షించుదాం. 1వ వచనం యిలా ఆరంభమౌతుంది, "ప్రతివాడును[17] పై అధికారులకు[18] లోబడియుండవలెను" (1ఎ వచనం). "లోబడియుండవలెను" అనేది *hupotasso* నుండి వచ్చింది. అది "ప్రాథమికంగా మిలిటరి పదం," "అధికారం క్రింద" అని అర్థం (*hupo* ["క్రింద"] + *tasso* ["అమర్చు"]).[19] *Hupotasso* అనేది "లోబడు" అని కొన్ని తర్జుమాల్లో ఉంది. ఆ పదంలో విధేయత చేర్చబడింది, కాని దాని అర్థం యింకను విశాలమైనది. "సహకారము, నమ్మకత్వము, లోబడుటకు యిష్టపడడాన్ని అది చుట్టి వస్తుంది."[20]

"మంచి ప్రభుత్వము," "చెడ్డ ప్రభుత్వము" అనే వ్యత్యాసాన్ని ప్రజలు చేయ ప్రయత్నించినట్టే, "మంచి చట్టాలు," "చెడ్డ చట్టాలనే" వ్యత్యాసాన్ని వారు చేస్తారు. "చెడ్డ చట్టాలంటే," వారికి ఏ అర్థముండినట్టు కన్పించనివి లేదా వారికి అసౌకర్యాన్ని కలిగించేవి, కష్టం కలిగించేవి కూడ కావచ్చు. "చెడ్డ చట్టాలకు లోబడాలని దేవుడు ఎదురు చూడడని వారు వక్కాణిస్తారు." ఆయా సమయాల్లో, మనలో ఎక్కువ మంది ప్రభుత్వ చట్టాలు విధుల విషయంలో కోపం తెచ్చుకుంటాం. రవాణా నియమావళి విషయంలో, పన్నుల నియమావళిలోను, భవన నిర్మాణ కోడ్ విషయంలోను నెమ్మదిగా జరిగే పేపర్ విషయంలోను మనం ముంచివేయబడినట్టు ఫీలౌతూ ఉంటాం. రాజకీయ యంత్రాంగం చేత గొంతు పిసికివేయబడినట్టు ఫీలౌతాం. అయినా, "మంచి చట

ట్టాలు," "చెడ్డ చట్టాలు" వేరు చేసే హక్కు మనకు తిరిగి యివ్వబడింది. అది చట్టమే అయ్యున్నట్టయితే, దానికి మనం లోబడాలి.

ఆ ప్రాథమిక సూత్రానికి మినహాయింపు ఏదైనా ఉంటుందా? నాకు తెలిసిన ఒకే ఒకటి పేతురు మాట్లాడిన విషయం. యేసు నామమునుబట్టి మాట్లాడకూడదనియు ప్రసంగించకూడదనియు యూదా మతాధికారులచే పేతురు యోహానులు ఆదేశించబడ్డారు (అపొస్తలుల కార్యములు 4:18), ఆ ఆజ్ఞను వారు అలక్ష్యం చేశారు. తిరిగి వారు సభ ఎదుటికి ఈడ్చుకొని పోబడినప్పుడు, పేతురు ఈ శ్రేష్ఠమైన మాటలు పలికాడు: "మనుష్యులకు కాదు దేవునికే మనము లోబడవలెను గదా" (అపొస్తలుల కార్యములు 5:29). మన ప్రస్తుతపు అంశానికి ఈ మాటలను ఎలా వర్తింపజేయాలి? దేవుని చట్ట ముతో సంఘర్షణ పడకుంటే మనము దేశ చట్టాలకు లోబడాలి. అనేక ఉదాహరణలు గుర్తుకొస్తున్నాయి. పాత నిబంధనలో, షద్రకు, మేషాకు మరియు అబేద్నెగోను అనువారు బంగారు ప్రతిమ యెదుట సాగిలపడ నిరాకరించారు (దానియేలు 3), తనకు తప్ప మరి ఏ దేవునికి ప్రార్థించకూడదనే రాజాజ్ఞను దానియేలు అలక్ష్యం చేశాడు (దానియేలు 6). క్రొత్త నిబంధన కాలంలో, తన విశ్వాసాన్ని వీడ నిరాకరించిన అంతిపయనువాడు హతసాక్షి అయ్యాడు (ప్రకటన 2:13).

ఈ ఆలోచనను మనం ముగింపుకు తెచ్చేముందు రెండు సత్యాలు నొక్కి చెప్పబడాలి. మొదటిది, "మనుష్యులకు కాక దేవునికే మనం లోబడినప్పుడు," దాని ఫలితాలను అనుభవించడానికి సిద్ధపడినవారమైయుండాలి. అపొస్తలులకు; షద్రకు, మేషాకు, అబేద్నెగోలకు; దానియేలుకు; అంతిపకు ఏమి సంభవించిందో ఆలోచించు. రెండవది, శ్రద్ధకలిగి నియమాన్ని పాటించేవారం కానట్టయితే, "మనుష్యులకు కాక దేవునికే మనం లోబడినప్పుడు," మన చర్యలు మన మనస్సాక్షిని వ్యక్తపరచేవిగా చూడబడక, మనం కలవరం కలిగించేవారంగా చూడబడతాం. పేతురు యిలా రాశాడు, "మీలో ఎవడును నరహంతకుడుగా గాని, దొంగగా గాని, దుర్మార్గుడుగా గాని, పరులజోలికి పోవువాడుగా గాని బాధ అనుభవింప తగదు. ఎవడైనను క్రైస్తవుడై నందుకు బాధ అనుభవించినయెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమపరచవలెను" (1 పేతురు 4:15, 16).

అప్పుడు నియమం యిదైయుంటుంది: ప్రాంతీయ, రాష్ట్రీయ, జాతీయ చట్టాలలో ఏదియు దేవుని ఆదేశాలను అతిక్రమించినప్పుడు, దానికి లోబడు. అది న్యాయ విరుద్ధమై ఉంటుందా? లోబడు. అది పరస్పర విరుద్ధమైయుంటుందా? దానికి లోబడు. సమాజంలో ఒక భాగానికి పక్షపాతం చూపినట్టౌతుందా? దానికి లోబడు. Jimmy Allen యిలా రాశాడు, " 'ఈ చట్టం చెడ్డదా?,' అనేది మన ప్రాథమిక ఆలోచన కాదు. కాని, ఈ చట్టానికి లోబడడం దేవుని వాక్యాన్ని ఉల్లంఘించుతుందా? (అపొస్తలుల కార్యములు 4:19). దుష్టత్వం చేయనని రూపించనట్టయితే, శిష్యులు ఆ చట్టానికి లోబడతారు అది వారిమీదికి శ్రమను తెస్తుంది."[21]

**కారణాలు**

1. దేవుడు మానవ ప్రభుత్వాన్ని నియమించినందున. "ప్రభుత్వ అధికారాలకు మనం ఎందుకు లోబడియుండాలి"? ఈ మొదటి హేతువును మనం ముందుగానే నొక్కి చెప్పాం. మానవ ప్రభుత్వాలను నియమించినవాడు దేవుడే. "ఏలయనగా దేవునివలన కలిగినది తప్ప మరి ఏ అధికారమును లేదు; ఉన్న అధికారములు దేవునివలననే నియమింపబడియున్నవి. కాబట్టి అధికారమును ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచున్నాడు" (13:1బి, 2ఎ). "కాబట్టి, అధికారానికి వ్యతిరేకంగా ఒకడు తిరుగుబాటు చేసినట్టయితే, అతడు దేవుడు నియమించిన దానికి వ్యతిరేకంగా వెళ్లుతున్నాడు" అని SEB అంది. మానవ ప్రభుత్వానికి లోబడుటలో తప్పిపోయినవాడు, ఒక విధంగా, దేవునే స్వయంగా ప్రతిఘటించినవాడౌతాడు.

"ఎదిరించుట" అనే మాట *antitasso* నుండి వచ్చింది (*anti* ["విరోధి"] + *tasso* ["అమర్చు"]). పౌలు *tasso* ("అమర్చు") అనే పదాన్ని అధ్యాయం 13లో మూడవసారి ఉపయోగించాడు. దేవుడు మానవ ప్రభుత్వాన్ని "అమర్చాడు." పౌర అధికారులకు సంబంధించి, (దేవుని "అమరిక") *tasso* క్రింద మనం ఉండాలి. ఆలాగున ఉండ మనం నిరాకరించినట్టయితే, మనం (దేవుని "అమరికకు") *tasso*కు వ్యతిరేకముగా ఉన్నట్టే. Coffman యిలా అభిప్రాయపడ్డాడు,

> క్రీస్తు ఎన్నడూ రహస్యంగా దాగియున్న కలహాన్ని రేపలేదు, ప్రభుత్వాన్ని విమర్శించలేదు, లేక రోమును వ్యతిరేకించిన యూదులలో భాగమైయుండలేదు. … చరిత్ర గమనం మీద ఆయన పరిశుద్ధ ఉపదేశాలు మహా గంభీరమైన ప్రభావాన్ని కనుపరచింది సత్యమైనా, ఆయన ప్రభావము డైనమైట్‌వలె గాక ఎల్లవేళలా అది పులి పిండివలెనే క్రియ జరిగించింది.[22]

2. శిక్షను తప్పించుకొనడానికి. పౌర అధికారాలకు లోబడమనడానికి పౌలు యిచ్చిన రెండవ కారణం: శిక్ష పొందక. "ఎదిరించువారు తమమీదికి తామే శిక్ష తెచ్చుకొందురు" (2బి వచనం). "శిక్ష" అనేది "తీర్పు" అనేదానికి వాడబడే సాధారణమైన పదమే: *krima.* "Damnation" అని KJVలో కన్పించే పదం చాలా తీవ్రమైనదిగా కన్పిస్తుంది. "ఎదిరించు వారు తాము పొందబోయే శిక్షకు తామే కృతజ్ఞత తెలుపవలసి యుంటారు" అని NEB అన్నది దాదాపు దగ్గరగా ఉన్నట్టుంది (నొక్కి చెప్పింది నాది). వచనాలు క్రిందికి వెళ్లితే, పౌర అధికారులచే శిక్షింపబడడమనేది ప్రాథమికంగా పౌలు మనస్సులో ఉన్నట్టు సూచిస్తుంది, కాని దేవుడే నియమించిన సంస్థకు అవిధేయత వ్యతిరేకంగా తిరుగుబాటు అయ్యున్నందున, తప్పక అది దేవుని శిక్షను తప్పించుకోలేదు.

3వ వచనంలో, పౌలు తన ఆలోచనా విధానాన్ని కొనసాగించాడు: "ప్రభుత్వము చేయువారు చెడ్డ కార్యములకే గాని మంచి కార్యములకు[23] భయంకరులు కారు; [*phobos*] … వారికి భయపడక [*phobos*] ఉండ కోరితివా? మేలుచేయుము, అప్పుడు వారిచేత మెప్పు పొందుదువు." "ఈ ఆందోళనను నీవు తప్పించుకొన గోరితివా, కేవలం చట్టబద్ధమైన జీవితాన్ని జీవించు" అని Phillips అంది. రూలు ప్రకారం, చెడ్డ

ప్రభుత్వాలు కూడ మంచి పౌరులను యిష్టపడతాయి.

పౌలు యింకను యిలా చేర్చాడు, “నీకు మేలు కలుగుటకు అధికారులు దేవుని పరిచారకులు” (4ఎ వచనం). “పరిచారకుడు” అనేది *diakonos*, “సేవకుడు” అనడానికి అది వాడే పదం. ఇదే పదాన్ని సంఘ పరిచారకుని, సువార్తికుని సంఘపు యితర పనివారిని వర్ణించేదైయుంది (రోమా 12:7; 1 తిమోతి 3:10, 13; 4:6). అయితే, పౌర ప్రభుత్వం యిప్పుడే ప్రస్తావింపబడిన యితరులవలే “దేవుని పరిచారకుడు” కాదనుకో. పరిచారకులు మరి యితర సంఘపు పనివారును దేవుని సేవించుతున్నట్టు ఎరిగియుండి, వారు దాన్ని యిష్టపూర్వకంగా చేస్తారు. దీనికి భిన్నంగా, పౌర అధికారులు దేవుని పరిచారకులన్న విషయాన్ని ఎరుగరు సరిగదా, ఆ ధోరణిలో వారు ఏ కార్యమూ జరిగింపరు. అయినా – యిష్టపూర్వకంగానో యిష్టం లేకుండగానో, తెలిసో తెలియకో – దైవ ప్రేరేపితుడైన అపొస్తలుని ప్రకారం, మానవ ప్రభుత్వం దేవుని సేవకుడైయుండి, “నీకు మేలు కలుగుటకు దేవుని పరిచారకులైయున్నారు.”

రకరకాలైన ఆక్షేపణలు చేయవచ్చు: “పౌర అధికారులు ఎంత అన్యాయస్థులై యుండగలరో, ఎంత తరచుగా మేలుకొరకు పరిచారకులు కాక కీడుకే వారు సేవకులైనట్టు పౌలు ఎరుగడా?” న్యాయం తీర్చేవారు ఏమైయుండగలరో, తరచుగా ఏమైయుంటారో, పొందిక లేకుండ ఎలా ఉంటారో పౌలుకు తేటగా తెలుసు, అది మనం నిశ్చయంగా చెప్పవచ్చు.

- కొరింథులో గల్లియోను అను అకయకు అధిపతి పౌలును బాగానే చూచాడు (అపొస్తలుల కార్యములు 18:12–16); దానికి ముందు ఫిలిప్పీలో, రోమా అధికారులచే శ్రమపెట్టబడి అవమానపరచబడ్డాడే (అపొస్తలుల కార్యములు 16:19–39).
- తరువాత, యెరూషలేములో, రోమా సైనికులచే హంతకులగు యూదుల మూకనుండి అతడు తప్పించబడ్డాడు (అపొస్తలుల కార్యములు 21:27–36); కాని కైసరయలోని రోమీయుల చెరసాలలో అతడు రెండు సంవత్సరాలు గడిపాడు (అపొస్తలుల కార్యములు 24:27). అది కేవలం ఒక లంచగొండి గవర్నరుకు లంచం యివ్వనందున అలా జరిగింది (అపొస్తలుల కార్యములు 24:26).
- తరువాత యింకను, అతని రోమా పౌరత్వం – తాను కైసరునకు విన్నవించు కుంటానని అన్నందున యూదుల చేతులలో మరణంనుండి అతడు తప్పించ బడ్డాడు (అపొస్తలుల కార్యములు 25:9–12). అయినా, (దైవ ప్రేరేపితం కాని పారంపర్యం ప్రకారం) రోమా ఖడ్గంచే శిరచ్ఛేదనం చేయబడి కడకు అతడు ప్రాణం పోగొట్టుకున్నాడు. (అతడు హతసాక్షి కానున్నది ఎదురు చూడబడింది 2 తిమోతి 4:6–8.)

అతనికి కొన్ని అనుభవాలు కలిగిన పిమ్మట కూడా, పౌర అధికారులు "మేలుకొరకు దేవుని పరిచారకులని" పౌలు ఎందుకు అన్నాడు? ఎందుకంటే, యిది సాధారణంగా నిజం. చట్ట ప్రకారం, మంచి ప్రవర్తనకు బహుమానాలు యిస్తాయి, దుష్ట ప్రవర్తనకు శిక్షలు యిస్తాయి. అలా చేయడం వారి క్షేమము కొరకైయుంటుంది. వేరొక విధంగా పని చేసే ప్రభుత్వం ఎక్కువ కాలం మన్నదు (నిలువదు).

4వ వచనంకు తిరిగి వచ్చి, మనం యిలా చదువుతాం: "వారికి భయపడక ఉండకోరితివా, మేలుచేయుము, అప్పుడు వారిచేత మెప్పు పొందుదువు. నీవు చెడ్డది చేసినయెడల భయపడుము, వారు ఊరకయే ఖడ్గము ధరింపరు; కీడు చేయువాని మీద ఆగ్రహము [*orge*] చూపుటకై వారు ప్రతికారము చేయు దేవుని పరిచారకులు" (4బి వచనం). పగ తీర్చుకొనడం మన పనికాదు, ఆలాటి విషయాలను మనం దేవుని చేతులకు అప్పగించాలని అధ్యాయం 12 నొక్కి చెప్పింది (12:19 చూడు). దుష్టత్వాన్ని దేవుడు శిక్షించే ఒక విధానం ప్రభుత్వపు కోర్టుల ద్వారా.

"వారు ఊరకయే ఖడ్గము ధరింపరు" అనే మాటలకు – చట్టం అమలు చేసేవారి ఖడ్గం కేవలం ప్రదర్శనకొరకు కాదని అర్థం. ("రొట్టెమీద వెన్న రుద్దడానికి వారు దానిని ఉపయోగించారు" అని మా ప్రొఫెసర్లలో ఒకడు అన్నాడు.) చెడుగును దూరపరచడానికి ఖడ్గం నేడు నాడు వాడబడుతుంది. పౌర అధికారుల కొరకు దేవుడు ఏర్పరచినదాన్ని కొన్నిసార్లు "మారణ అధికారమని" పిలుస్తారు. అమలుచేయడానికి వీలులేని చట్టాన్ని మంచి సలహా అని అంటారు.[24]

చెడుగును శిక్షించడమనేది పౌలు అంశమైయున్నందున, మరణ శిక్షకు దేవుని అంగీకారాన్ని 4వ వచనం స్థిరపరచుతుందని నేను అర్థం చేసికొంటాను. "ఖడ్గము" (*machaira*) అనే పదం ముందటి మన స్టడీలో కన్పించింది (8:35). ఆ పదానికి అశుభమైన భావం ఉన్నట్టు మనం ముందుగా గుర్తించాం, దౌర్జన్యపు మరణము విధింపు మనస్సుకు వస్తాయి. James Denney యిలా రాశాడు, "ఉన్నతమైన న్యాయాధిపతుల వలన కాకుంటే, వారి ముందు ఖడ్గము అలవాటుగా కొనిపోబడు తుంది. వారి చేతిలోనున్న జీవము, మరణముల అధికార సూచనగా ఉంటుంది."[25] Lewis యిలా అభిప్రాయ పడ్డాడు, "ఖడ్గము అధికార సూచనయైయుంది." కాని "దానితోపాటు మరణదండన విధించే అధికారం కూడా వెళ్లింది."[26] మనం ఒక లేఖన భాగం చదివినప్పుడు మనం అడుగవలసిన తొలి ప్రశ్నలలో ఒకటి ఏమంటే "మొట్ట మొదట దీన్ని చదివినవారికి, విన్నవారికి ఏమి అర్థమిచ్చింది?" రోమా 13:4కు సంబంధించి Bob E. Adams యిలా తీర్మానించాడు – దుష్ట క్రియలు చేసేవారిని శిక్షించే హక్కు "... అనేది పౌలు పాఠకులకు ఈ లేఖన భాగమిచ్చే బహు సహజమైన అర్థమైయుంటుంది."[27]

పూర్వ కాలమందు, దేవుడు నోవాహుకు సార్వత్రికమైన సూచన యిచ్చాడు: "నరుని రక్తమును చిందించువాని రక్తము నరునివలననే చిందింపబడును" (ఆదికాండము 9:6ఎ). ఈ సూత్రము మోషే ధర్మశాస్త్రములో ఒక భాగంగా చేయబడింది (నిర్గమకాండము 21:12), క్రొత్త నిబంధనతో అది పొసగునదైయున్నట్టు రోమా 13 సూచిస్తుంది. మరణ

దండనకు సంబంధించిన సమస్త ప్రశ్నలను యిది కుదర్చదు. అంటే, "మరణదండన బహుగా తగినట్టు భయపెట్టేదా మరియు/లేక బహు న్యాయమైన శిక్షయా" అనేది తేల్చదు.[28] నేను స్థాపించేదంతా ఏమంటే, రోమా 13:4 ప్రకారం, దేశము నియమించే మరణదండన దేవుని చిత్తమునకు విరోధమైనది కాదు.

ఈ పాయింటు వద్ద, యితర దిగ్భ్రమ కలిగించే ప్రశ్నలు ఉద్భవిస్తాయి. దుష్టత్వాన్ని శిక్షించే బలాన్ని ప్రయోగించడానికి దేవుడు పౌర ప్రభుత్వాలకు అధికారం ప్రసాదించాడు. అయితే క్రైస్తవుడు ఆ అధికారాన్ని ప్రయోగించవచ్చా? అంటే, క్రైస్తవుడు రాజకీయ అధికారాన్ని చేపట్టవచ్చా?[29] క్రైస్తవుడు పోలీసుగాని, సైనికుడుగా గాని ఉండ వచ్చా? చివరి ప్రశ్నకు సంబంధించి, గత కాలంలో, అనేకమంది క్రైస్తవులు లేదు అని చెప్పియుండే వారే. నేడు, అనేకులు అవును అనే జవాబు (చెప్పవచ్చు) ఈ ప్రశ్నకు సంబంధించి, ప్రస్తుతపు సంభవాలచే ప్రభావితం చేయబడుచున్నవాటిని గూర్చి – క్రొత్తగా చెప్పుతుందని నేను సందేహిస్తాను. గత కాలంలో, వ్యక్తిగత మనస్సాక్షికి విషయం అప్పగింపబడింది. తనపట్ల దేవుని చిత్తమేమైయుందో ప్రతి క్రైస్తవుడు తీర్మానించుకొనడానికి విడువబడ్డాడు. (అభిప్రాయం విషయంలో వేరు తాత్పర్యం కలిగియున్న సాటి క్రైస్తవులను ఎలా ట్రీట్ చేయాలో రోమా 14 దృష్టి నిలుపుతుంది.)

ఈలాటి ప్రశ్నలను చర్చించుచుతూ పేజీలను నింపుకొంటూ పోవచ్చు, కాని రోమా 13:4లోని పౌలు పాయింటుతో వాటికి ఎక్కువ సంబంధం ఉండదు. నీవు దేశ చట్టాలకు లోబడవలసిన హేతువేమంటే, నీవు లోబడకుంటే శిక్షింపబడతావు.

3. "మనస్సాక్షి నిమిత్తం." పట్టబడకుండ, శిక్షింపబడకుండ చట్ట ఉల్లంఘనం చేయవచ్చుననే నమ్మిక నీకు ఉన్నట్టయితే ఏమి? ఈ అవకాశాన్ని పౌలు అయిదవ వచనంలో చర్చించాడు: "... ఆగ్రహ భయమునుబట్టి మాత్రము కాక మనస్సాక్షిని బట్టియు లోబడియుండుట అవశ్యకము." తప్పు ఒప్పుల మధ్య వ్యత్యాసాన్ని చేయ సహాయపడడానికి దేవుడు మనలో ప్రతి ఒక్కరికి యిచ్చిన సామర్థ్యమే మనస్సాక్షి.[30] వేగపు చట్టాలకు లోబడతారు ఎందుకంటే అతిక్రమించినందుకు జరిమానా విధింపబడతారనే భయంతో. కొందరు ఆదాయపు పన్ను కడతారు ఎందుకంటే వారు దాని నిమిత్తము వ్యాజ్యెం ఎదుర్కోవలసి వస్తుందనే భయంతో.[31] పౌలు మనకు యిలా తెలియజేశాడు, "అధికారులకు లోబడేది కేవలం క్షేమంగా ఉండడానికి మాత్రం కాక, అలా చేయడం సరియైనది గనుక" (రోమా 13:5; Phillips; నొక్కి చెప్పింది నాది) – అలా చేయునట్లు దేవుడు మనపట్ల కోరతాడు గనుక. పౌలువలె, మనము కూడ "ఈ విధమున దేవునియెడలను మనుష్యుల యెడలను ఎల్లప్పుడు మన మనస్సాక్షిని నిర్దోషంగా ఉండునట్లు అభ్యాసం చేసికొందాం" (అపొస్తలుల కార్యములు 24:16).

## అధికారానికి సంబంధం కలిగియుండు! (13:6, 7)

మానవ ప్రభుత్వంతో క్రైస్తవునికి ఉండవలసిన సంబంధాన్ని గూర్చిన సత్యాలను 1నుండి 4 వచనాలవరకు పౌలు స్థాపించాడు: దేశపు చట్టాలకు మనం లోబడాలి; మనం మంచి పౌరులమైయుండాలి. 6, 7 వచనాలలో మంచి పౌరత్వం ఎలాటిదై

యుంటుందో అపొస్తలుడు ప్రత్యేకమైన సూచనలనిచ్చాడు.

**నీ పన్నులను చెల్లించు**

6వ వచనం యిలా అంటుంది, “ఏలయనగా వారు దేవుని సేవకులైయుండి యెల్లప్పుడు ఈ సేవయందే పని కలిగియుందురు. ఇందుకే గదా మీరు పన్ను కూడ చెల్లించుచున్నారు?” పన్నులు చెల్లించు [*phoros*]. వచనం 4లో “పరిచారకుడు” అని తర్జుమా చేయబడిన దానికంటే ఈ గ్రీకు పదం వ్యత్యాసమైనది. *Leitourgos* అనేదానికి బహువచన రూపం, “యాజకుడిచ్చు సేవా స్వభావానికి ఈ పదం భద్రం చేయబడింది.”[32] “భూసంబంధమైన ఏలికలు దేవుని సేవకులన్న మనస్సాక్షితో, దేవుని సేవకులైయున్నట్టు స్పృహ కలిగి పని చేయరు, అయినప్పటికిని, దేవుని విధికి సంబంధించిన కార్యాలను జరిగిస్తారు.[33] ఈ వాస్తవాన్ని యిది నొక్కి చెప్పుతుంది.”

“ఈ సేవయందే పని కలిగియుందురు” మానవ ప్రభుత్వాలు ఏమి చేయ నిర్దేశించబడ్డాయో అది ఈ మాటలలో పౌలు సూచించాడు (లేక గుప్తం చేశాడు): వారు పౌరులను కాపాడడం, తమ కొరకు తాము ఏర్పరచుకోలేని సేవలను తమ పౌరులకు అందించడం. మానవ ప్రభుత్వాలు దేవునివలన నియమించబడినవి గనుకను, ప్రభుత్వోద్యోగులు (ఒక విధంగా) ఆ పనిని నెరవేర్చుతున్నారు గనుకను, మనము పన్ను చెల్లింప బద్ధులమై యున్నాం. ఏ మేరకు మనకు ప్రభుత్వం కావాలో అనేదాని విషయంలో ప్రజలు ఏకీభావము లేనివారైయుంటారు (అది మనం చెల్లించే పన్ను యొక్క మొత్తం మీద మార్పు కలిగిస్తుంది), “కాని దేశం యివ్వవలసిన కొన్ని సేవలుంటాయి, వాటికి మాత్రం డబ్బు చెల్లించాలి, యిట్టివి పన్నుల అవసరతను కలిగిస్తాయని అందరు అంగీకరిస్తారు”[34] అని John R. W. Stott గుర్తించాడు.

ఈ చర్చలో పన్నులు చెల్లించాలనే హెచ్చరిక తరువాత పుట్టిన ఆలోచన కాదు. ముందటి వచనాల్లో ఈలాటి తీర్మానానికి పౌలు పునాదివేశాడు. ఈ పాఠానికి పరిచయంలో గుర్తించినట్టు, యూదులు రోముకు పన్నులు చెల్లింప ద్వేషించేవారు. అయినా, అది జరగాలని పౌలు నిర్బంధించాడు. మనం పన్నులు చెల్లింపకపోయినట్టయితే, మనం ప్రభుత్వాన్ని మోసగించి న్యాయమైన మన వంతు మనం చేయడంతో తప్పిపోవడం మాత్రమే గాక, మనం దేవునికి అవిధేయులం కూడ అయ్యుంటాం.

మరొక ఆక్షేపణ సాధారణమైనది: “నేను పన్నులు చెల్లిస్తుంటే, ప్రభుత్వం చిక్కుబడి యున్న భక్తిహీనమైన కార్యకలాపాలను బలపరచినట్టు కాదా!” “కైసరుది కైసరుకును దేవునిది దేవునికిని చెల్లించుమని” క్రీస్తువారు చెప్పిన మాటలను నేను జ్ఞాపకం చేస్తాను (లూకా 20:25). ఇంకో విషయం గుర్తుంచుకో పన్నులు చెల్లించుమని పౌలు చెప్పుతుంది విగ్రహ పూజలు చేసే అధికారులతో నిండిన రోమా సామ్రాజ్యానికి. అటు ప్రభువైన క్రీస్తువారును యిటు అపొస్తలుడైన పౌలును పన్నులు చెల్లించుడని చెప్పారు. మన బాధ్యత మన పన్ను చెల్లించడం; ఆ డబ్బును జ్ఞానయుక్తంగా వాడడం అధికారుల బాధ్యతయైయుంది. వారు తమ బాధ్యతను నెరవేర్చకపోయినట్టయితే, మనం మన బాధ్యతను నెరవేర్చక పోవడానికి క్షమాపణ కాదు.

వచనం 7లో పౌలు తన ఆలోచనను తిరిగి అమలుచేశాడు. ఆ వచనం యిలా ఆరంభమౌతుంది, "ఇందుకే గదా మీరు పన్ను కూడ చెల్లించుచున్నారు." "అందరికిని" వారి వారి ఋణములను తీర్చుడి. ఈ సందర్భంలోని, "అందరు" అనేది పౌర అధికారులను సూచిస్తుంది – చిన్నవాడు మొదలుకొని పెద్దవానివరకు, అతి తక్కువ ప్రాముఖ్యతగలవాని మొదలుకొని అతి ప్రాముఖ్యమైనవానివరకు. "చెల్లించుడి" అనేది, "కైసరువి కైసరునకును దేవునివి దేవునికిని చెల్లించుడని" ప్రభువు అన్నదానిలో వాడిన గ్రీకు పదమే యిక్కడ కూడ వాడబడింది.

"కాబట్టి యెవనికి పన్నో వానికి పన్నును, ఎవనికి సుంకమో వానికి సుంకమును చెల్లించుడి" (7ఎ, బి వచనం). "పన్ను" అనేది *phoros* నుండి వచ్చింది, వచనం 6లో కన్పించే పదం, లూకా 20:22లో క్రీస్తువారి యెదుట పెట్టబడిన ప్రశ్నలో ఉంది. *Phoros* అంటే, " 'కప్పము' అని అర్థం. అది లోబరచబడిన దేశంచే చెల్లింపబడేది."[35] "సుంకము" అనేది *telos* నుండి వచ్చింది. "ప్రభుత్వపు పనులకు చెల్లించబడే 'పన్ను, సుంకము, టోల్.' "[36] ఈ రెండు గ్రీకు పదాల మధ్య వ్యత్యాసాన్ని చేయడం కష్టం. ఈ రెండింటిని ఉపయోగించడంలో అన్ని రకాలైన పన్నులను కలిపి చూపాలని పౌలు ఉద్దేశించాడేమో: ప్రభుత్వపు పన్నులు, మరుగైన పన్నులు.[37] అయితే మాత్రం సందేశం బహు తేటగా ఉంది: క్రైస్తవులు వారు పన్నులను చెల్లింపవలసినవారైయున్నారు.

## ప్రభుత్వాధికారులను గౌరవించు

పన్నులు చెల్లించడంకంటెను మరి ఎక్కువ సవాలుగా కొందరికి కన్పించే ఒక ఆవశ్యకతను పౌలు యిక్కడ చేర్చుతున్నాడు: "ఎవనియెడల భయము కలిగియుండవలెనో వానియెడల భయమును, ఎవనియెడల సన్మానముండవలెనో వానియెడల సన్మానమును కలిగియుండుడి" (7సి వచనం). "భయము" అనేది *phobos* నుండి తర్జుమా చేయబడింది. దీనికి పలు రకాలైన అర్థాలుంటాయి. 3, 4 వచనాల్లో "భయము" అనడానికి వాడబడిన పదం అదే. అది శిక్షకు సంబంధించిన భయం. అయితే వచనం 7లో వేరే కోణం నొక్కి చెప్పబడింది. "గౌరవం" అనేది యిక్కడ వ్యక్తపరచబడిన భావమైయుంది (RSV; AB; McCord చూడు). "ఘనపరచు" అనేది *time* నుండి వచ్చింది, విలువైనదిగా ఎంచడం అని అర్థం.[38] ఈ సందర్భంలో, పౌలు ప్రభుత్వ అధికారులను సూచిస్తున్నట్టు మనస్సులో ఉంచుకో.

చివరి ఆక్షేపణను దాఖలు చేయవచ్చు: "ఫలాని ప్రభుత్వాధికారిని నేను గౌరవించలేను, వాని ఘనపరచడానికి నేను అంగీకరించను. అతడు అక్రమస్థుడు, నీతిలేనివాడు!" పౌలు రోమా ప్రభుత్వపు అధికారులను గూర్చి మాట్లాడుతున్నాడనియు, వారిలో అనేకులు బహుగా చెడిపోయినవారు అనీతిపరులనియు నీకు మరల గుర్తు చేస్తున్నా. "రాజును సన్మానించుడి" అని పేతురు అన్నప్పుడు (1 పేతురు 2:17), బహుగా భక్తిహీనుడగు రోమా చక్రవర్తియైన నీరోను అతడు సూచించాడు. ఒకవేళ నీవు మనిషిని గౌరవించక పోయినా, కనీసం అతని అధికారాన్నైనా గౌరవించు అని చెప్పబడింది.[39] నేను వ్యక్తిగతంగా గౌరవించని US ప్రెసిడెంట్లున్నారు – కాని వీరిలో

ఒకరు గదిలోనికి నడిచేటప్పుడు నేను అక్కడ ఉంటే, ఆ అధికారానికి గౌరవంగా నేను లేచి నిలబడతాను.

వచనం 7ను మనం విడువక ముందు, న్యాయసమ్మతంగా తక్కిన అధికార వర్గానికి, అంటే – తలిదండ్రులకు, పాఠశాల అధికారులకు, పెద్దలకు, భర్తలకు – ఈ అధికారాన్ని వర్తింపజేయవచ్చు. ప్రతి సమాజంలోను అధికారానికి మాత్రం గౌరవం చూపని ప్రజలుంటారు. ఆలాటివారికి పౌలు యిలా చెప్పుతున్నాడు: "ఎవనియెడల భయముండ వలెనో వానియెడల భయమును, ఎవనియెడల సన్మానముండవలెనో వానియెడల సన్మానము కలిగియుండి, *అందరికి* వారి వారి ఋణములను తీర్చుడి" (నొక్కి చెప్పింది నాది).

## ముగింపు

రోమా 13:1–7లోని పౌలు ఉపదేశాన్ని ఎలా మనం సంగ్రహం చేద్దాం? William Barclay ఈ లేఖన భాగాన్ని యిలా సంగ్రహం చేశాడు:

> లోకాన్ని అవ్యక్త స్థితినుండి కాపాడడానికి దేశము దేవుని చేతిలోని సాధనముగానున్నట్టు పౌలు చూచాడు. ఆ గొప్ప పనిలో దేశాన్ని ఏలేవారు తమ వంతును జరిగిస్తున్నారు. వారు దేవుని పని చేస్తున్నట్టు ఎరిగినా ఎరుగకున్నా, సహాయము చేయడమే క్రైస్తవుని బాధ్యత గాని ఆటంకపరచడం కాదు.[40]

రోమా 13:1–7లో మానవ ప్రభుత్వంతో క్రైస్తవునికి కలిగియున్న బాంధవ్యమనే అంశాన్ని పౌలు *పూర్తిచేయలేదు.* ఉదాహరణకు, 1 తిమోతి 2:1, 2లో వలె ప్రభుత్వ అధికారుల కొరకు ప్రార్థించుమని ఈ లేఖన భాగంలో చెప్పలేదు.[41] 1 తిమోతి 2తో రోమా 13ను చేర్చి, ప్రభుత్వంపట్ల క్రైస్తవుని బాధ్యతను గూర్చి ఆలోచిస్తే, "చెల్లించు, ప్రార్థించు, లోబడియుండు" అని చెప్పబడింది. దీనికి మించినది, వ్యక్తిగత మనస్సాక్షికి సంబంధించినదై ఉంటుంది.[42]

---

## సువార్తికులకు, ఉపదేశకులకు నోట్సు

భూమిమీద రాజకీయ ఏర్పాటులో భాగంగా ఉండడంకంటే, దేవుని రాజ్యములో భాగమైయుండడం ఎక్కువ ప్రాముఖ్యమని ఈ పాఠాన్ని ముగించుతూ నొక్కి చెప్పవచ్చు. నీటిమూలముగాను ఆత్మమూలముగాను జన్మించడం ద్వారా సంఘమనే ప్రభువు రాజ్యంలో భాగమైయుండవచ్చు (యోహాను 3:3, 5). క్రీస్తులోనికి నీటియందు "పాతిపెట్టుట" ద్వారా అది జరుగుతుంది (అపొస్తలుల కార్యములు 2:38; రోమా 6:3, 4). ఆ సమయంలో, దేవుడు "మనలను తన కుమారుని రాజ్య నివాసులుగా తీర్చుతుంటాడు" (కొలొస్సయులకు 1:13).

ఈ పాఠానికి వేరే పేర్లు "మంచి పౌరుడైయుండడంపై" మరియు "ఎలా మంచి పౌరులైయుండాలి" రోమా 13:1–7ను ఈ క్రింది విధంగా అవుట్‌లైన్ చేయవచ్చు:

ప్రభుత్వానికి విధేయత (1, 2 వచనాలు), ప్రభుత్వపు చర్యలు (3–5 వచనాలు), ప్రభుత్వం పట్ల బాధ్యతలు (6, 7 వచనాలు).[43]

నీవు ఈ మూల వాక్యాన్ని ఉపదేశించేటప్పుడు, పౌర ప్రభుత్వంపై కేంద్రీకరించడం కంటే "అధికారమునకు గౌరవము" అనే పేరుతో సాధారణంగా అధికారంపై మాట్లాడవచ్చు. వచనం 7 సందర్భంలో నేను యిందులో కొన్ని రిమార్క్లు చేర్చాను. ఈ మూలవాక్యం మీద D. Stuart Briscoe కొన్ని కామెంట్లు చేశాడు: "అధికారం పట్ల క్రైస్తవుని వైఖరి." అతని ప్రధాన హెడ్డింగ్స్ ఏమంటే "అధికార సూత్రం," "అధికార ఉద్దేశం," మరియు "అధికార సమస్యలు."[44]

"శత్రు లోకంలో ఎలా జీవించాలి" అనే పేరుతో Coy Roper రోమా 13 అధ్యాయం మొత్తాన్ని కవర్ చేశాడు. అతని మెయిన్ పాయింట్స్: (1) "ప్రభుత్వ పక్షంగా: గౌరవంతో" (1–7 వచనాలు); (2) "మన పొరుగువారి పట్ల: ప్రేమతో" (8–10 వచనాలు); (3) "లోకం పట్ల: పవిత్రతతో" (11–14 వచనాలు).[45]

రోమా 13:5లో "మనస్సాక్షి నిమిత్తము" అని ఉన్నందున, మనస్సాక్షి మీద మామూలు పాఠం లేక ప్రసంగం చేయడానికి యిదొక మంచి స్థలం రోమా 14 "మనస్సాక్షి" అనే మాటను ఉపయోగింపకపోయినా, నీ చర్చలో ఆ అధ్యాయంనుండి వచనాలను కూడ చేర్చవచ్చు.

---

సూచనలు

[1]ఆ సమయంలో, క్రైస్తవులకును, యూదులకును రోమా ప్రభుత్వం ఏ భేదమూ చేయలేదు అపొస్తలుల కార్యములు 18:2లో కేవలం యూదులు అని మాత్రమే ప్రస్తావించబడింది, యూదులు క్రైస్తవులు కూడ రోమునుండి తరిమివేయ బడ్డారని మత సంబంధం కాని రచనలు తెలుపుతున్నాయి. [2]రోమా 13:1–7 పౌలు వ్రాయలేదని, తరువాత ఎవరో దానిని పత్రికలోనికి చేర్చారని కొందరు అభిప్రాయపడ్డారు. దీనికి చేతిప్రతుల ఆధారాలు ఏవీ లేవు. ప్రతి క్రైస్తవునికి అవసరమైన అభ్యాస సందేశమిది. [3]W. E. Vine, Merrill F. Unger, and William White, Jr., *Vine's Complete Expository Dictionary of Old and New Testament Words* (Nashville: Thomas Nelson Publishers, 1985), 45. [4]Ibid., 33-34. [5][Background] పూర్వ గాథ సమాచారం కొరకు, యెషయా 44:28–45:7 చూడు. [6]దానియేలు 2:21, 37, 38; 4:17–35లో పూర్వగాథ సమాచారం యివ్వబడింది. [7]... హిట్లర్, స్టాలిన్ మొదలైనవారు. నీ శ్రోతలకు తెలిసినవారిని పరిచయం చెయ్యి. [8]మానవ ప్రభుత్వానికి ఆదికాండము 9:1–7 ఆధారమైయుంటుందని కొందరు రచయితలు నమ్ముతారు. అయితే ఆయన నిజంగా దీనినెలా చేశాడో, ఎప్పుడు చేశాడో మనమెరుగం. [9]James Burton Coffman, *Commentary on Romans* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1973), 446. [10]Jack P. Lewis, *Exegesis of Difficult Passages* (Searcy, Ark.: Resources Publications, 1988), 95.

[11]ప్రతిపాదనను వివరించు. [12]దేవుని పరిచారకులుగా మానవ ప్రభుత్వాలు చేయవలసినవి చేయకపోయినా, క్రైస్తవుడుగా నీవు ఏమి చేయాలో దానినుండి అది నిన్ను మినహాయించదు. [13]పూర్వ చరిత్ర సమాచారం కొరకు యెషయా 10:5–12 చదువు. [14]రోమీయుల న్యాయ భావన మంచిది, రోమా సామ్రాజ్యమంతటిలో శాంతి నెలకొల్పడానికి రోము ప్రయత్నించింది. సామ్రాజ్యంలోని ప్రతి భాగానికి వెళ్లడానికి రోమీయుల రోడ్లు సహకరించాయి. ఈ వసతులను సువార్త వ్యాపకం నిమిత్తము పౌలు వాడుకున్నాడు. [15]R. C. Bell, Studies in Romans (Austin, Tex.: Firm Foundation Publishing House, 1957), 146. [16]పౌలు కైసరయలో రెండు సంవత్సరాలు చెరసాలలో ఉంచబడ్డాడు (అపొస్తలుల కార్యములు 24:27) + కనీసం రోములో రెండు సంవత్సరాలు (అపొస్తలుల కార్యములు 28:30). [17]"Person" అనేది *psyche* నుండి తర్జుమా చేయబడింది, అది "ప్రాణము" అనే పదానికి చెందింది. 1 పేతురు 3:20లో వలె, *psyche*

అనేది కేవలం ప్రజలను సూచిస్తుంది. [18]"ఏలుట" అనేది *huperecho* (*huper* ["మీద"] + *echo* ["కలిగియుండుట"]). ఈ మాటకు ప్రాథమికంగా, "హెచ్చయిన" అని అర్థం (KJV చూడు). [19]Vine, 606. ఈ మాట తరచుగా "లోబరచుకొను" అని తర్జుమా చేయబడింది. [20]Bruce Barton, David Veerman and Neil Wilson, *Romans,* Life Application Bible Commentary (Wheaton, Ill.: Tyndale House Publishers, 1992), 246.

[21]Jimmy Allen, *Romans, The Clearest Gospel of All* (Searcy, Ark.: By the author, 2005), 266. [22]Coffman, 447-48. [23]ఇక్కడ గ్రీకు అక్షరార్థంగా "మంచి పని" (సత్క్రియ). [24]Adapted from Alva J. McClain; quoted in Jim Townsend, *Romans: Let Justice Roll* (Elgin, Ill.: David C. Cook Publishing Co., 1988), 90. [25]James Denney, *St. Paul's Epistle to the Romans,* in *The Expositor's Greek Testament,* vol. 2 (London: Hodder and Stoughton, 1901; reprint, Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 697. [26]Lewis, 96. [27]Bob E. Adams, "Responsible Living in Community Selling (Romans 12-16)," in "Studies in Romans," *Southwestern Journal of Theology* 19 (Fall 1976): 63. [28]Ibid. [29]రాజకీయ అధికారంలో క్రైస్తవులు ఉండాలని నేను ఆశిస్తున్నాను, కాని అది అభిప్రాయం మాత్రమే. రాజకీయ అధికారులు క్రైస్తవ సూత్రాలను రాజీ చేసే అవకాశముంది. [30]*రోమీయులకు, 1లో* "అన్యజనులు, మనస్సాక్షి, సువార్త పని (2:14, 15)" చర్చను రివ్యూ చేయి.

[31]పరిస్థితికి అనుగుణంగా ఈ వాక్యమును ఉపయోగించు. [32]D. Stuart Briscoe, *Mastering the New Testament: Romans,* The Communicator's Commentary Series (Dallas: Word Publishing, 1982), 232. *Leitourgos* యొక్క క్రియావాచక రూపము "ఇట్టి సేవ" అని తర్జుమా చేయబడింది రోమా 12:1లో. [33]Vine, 410. [34]John R. W. Stott, *The Message of Romans: God's Good News for the World,* The Bible Speaks Today series (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1994), 346. [35]Vine, 643. [36]Ibid., 142. పన్ను కట్టమని ప్రభువు పేతురుకు చెప్పినప్పుడు, మత్తయి 17:25లో ఈ పదం వాడబడింది. [37]క్రొత్త నిబంధన కాలంలో కట్టవలసిన పన్నుల జాబితాను William Barclay యిచ్చాడు (William Barclay, *New Testament Words* [Philadelphia: Westminster Press, 1974], 175). [38]Vine, 310. [39]అపొస్తలుల కార్యములు 23:1–5లో మనిషిని గౌరవించకపోయినా, పౌలు అధికారాన్ని గౌరవించాడు. [40]Barclay, 174.

[41]యిర్మీయా 29:7ను చూడు. [42]ఒకప్పుడు క్రైస్తవులు ఓటు కూడ వేయకూడదని తలంచారు. ఒక మతశాఖయైతే జాతీయ జెండాకు సెల్యూట్ చేయకూడదని తలంచింది. దేవుని చిత్తాన్ని వ్యతిరేకించనంత వరకు క్రైస్తవులు పౌర విషయాల్లో పాల్గొనడం తప్పు లేదనేది నా అభిప్రాయం. [43]Adapted from Townsend, 89. [44]Briscoe, 231-36. [45]Coy Roper, sermon preached at Walnut Grove church of Christ, Savannah, Tennessee, 12 November 2000.

## సాతాను, ప్రభుత్వాలు

మానవ ప్రభుత్వానికి సంబంధించి, కొంత ప్రత్యేకమైన నోట్సు అవసరం కావచ్చు. మొదట, సాతాను తన స్వప్రయోజనాల కొరకు తరచుగా ప్రభుత్వాలను వాడుకుంటాడని మనం ఎరగాలి. అలా జరిగినప్పుడు సయితం, తన సంకల్పాన్ని నెరవేర్చుకొనడానికి దేవుడు యింకను పరిస్థితిని తన అదుపులో ఉంచుకొనగలడు. ఉదాహరణకు, యేసును చంపడానికి అపవాది యూదులను, రోమీయ అధికారులను ఉపయోగించుకున్నాడు. అయినప్పటికి, దేవుడు అదుపు తప్పనియ్యలేదు. ఎందుకంటె సిలువ వేయబడడం ఆయన అనాది సంకల్పంలో భాగమైయుంది. ఆలాగే, పౌలు సీలలను కొట్టి అవమానపరచి చెరలో వేయడానికి అపవాది రోమా అధికారులను వాడు కొన్నాడు. అయితే చెరసాల నాయకుడును, అతని యింటివారును మార్పు పొంద డానికి దేవుడు ఆ సందర్భాన్ని వాడుకున్నాడు (అపొస్తలుల కార్యములు 16:16–34 చూడు).

ఒక్క చివరి ఉదాహరణను ఆలోచించు: అనేక సంవత్సరాలు పౌలును చెరసాలలో ఉంచడానికి రోమా అధికారులను అపవాది వాడుకున్నాడు. అయినా, రాజులకును, ఏలికలకును ప్రకటించడానికి అది పౌలుకు అవకాశం కల్పించింది (అపొస్తలుల కార్యములు 24:24, 25; 25:23; 26:1–29). అటు తరువాత పౌలు రోముకు కొనిపోబడ్డాడు. అక్కడ అతడు ఖైదీలకు ప్రకటించాడు – తత్ఫలితంగా కైసరు యింటి లోనికి సువార్త ప్రవేశించింది (ఫిలిప్పీయులకు 4:22). రోమా 13:1–7లో, అపవాది సంబంధమైన ప్రభుత్వాలలో దేవుడు ఎలా డీల్ చేస్తాడో లేక ఆలాగున్నప్పటికి ఆయన తన ఏర్పాటును ఎలా సాధించుకుంటాడో అని సంయుక్త విషయాలను చర్చించడం పౌలు ఉద్దేశం కాదు. అపొస్తులుడు కేవలం ఒక సాధారణ సూత్రాన్ని స్థాపింపగోరాడు అదేమంటే – దేవుడు మానవ ప్రభుత్వాన్ని స్థాపించి, తన ఉద్దేశాలను సఫలం చేసికొనడానికి ఆయన వాటిని వాడుకుంటాడని అపొస్తలుడు కేవలం చెప్పాడు.

ప్రభుత్వ అధికారులను గౌరవించి వారికి లోబడడం నేనుండే దేశంలో సులభమే. అయితే కొన్ని జనాంగాల్లో పౌలు చెప్పినదాన్ని అనుసరించడం కష్టతరమని నేనెరుగుదును. నీవు అడిగే ప్రతి ప్రశ్నకు నేను జవాబు చెప్పగలగాలని నేను కోరుకుంటాను, కాని నేనది చేయలేను. నేను చేయగలిగిందంతా ఏమంటే, పౌలు ఉపదేశాన్ని ఎంత స్పష్టంగా చెప్పాలో అంత స్పష్టంగా చేయ ప్రయత్నించడమే. ఆ తరువాత దానిని నీ పరిస్థితిలో వర్తింపజేసికొనడమే. అట్టి ప్రయాసలో దేవుడు నీకు తోడైయుండును గాక.